ప్రజాశక్తి

సోమవారం 9 డిసెంబర్ 2024

5

విజయనగరం

ఆకాశంలో మబ్బులు
అన్నదాతల్లో గుబులు

పొలాల్లో కోసి ఉంచిన వరిచేను

ప్రజాశక్తి-గజపతినగరం

హిందూ మహా సముద్రంలో అల్పపీడనమంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు, అందుకు తగ్గట్టే ఆకాశంలో అకస్మాత్తుగా మబ్బులు ఏర్పడటంతో అన్నదాత గుండెల్లో గుబులు రేపుతోంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉన్నప్పటికీ అనంతరం ఒక్కసారిగా నల్లని మబ్బులు ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి కోతలు పూర్తయి పంటంతా పొలాల్లో, కళ్లాల్లో ఉంది. కొన్నిచోట్ల ఇంకా పంటకోత దశలో ఉంది. రానున్న మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ .అంబేద్కర్ తెలిపారు.

వినియోగదారులకు సర్దుపోటు

వినియోగం తగ్గినా పెరిగిన ఛార్జీలు
ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 పేరుతో దొంగదెబ్బ
భరించలేని భారమంటున్న వినియోగదారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/ కోట

గతంలో వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచినందుకు ఎన్నికలకు ముందు విపరీతమైన విమర్శలు చేసిన నేటి చంద్రబాబు ప్రభుత్వం ఏరుదాటే వరకు ఓడ మల్లన్న... ఒడ్డుకు చేరాక బోడి మల్లన్న అన్న చందంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం నాటి వైసిపి మాదిరిగానే సర్‌ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరిట విద్యుత్ భారం మోపింది. బిల్లులో ఎఫ్‌పిపిసిఎ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్), ఎఫ్‌పిపిసిఎ2 పట్టికలో పరిశీలిస్తే ఈ దొంగదెబ్బ ఇట్టే అర్థమౌతుంది. జిల్లాలో 9,64,006మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరందరిపైనా ఈ భారం పడుతుంది. 2025 జనవరి నుంచి మరోసారి కూడా ఛార్జీలు పెంచేందుకు రంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో సగటు వినియోగదారుడిపై నెలకు రూ.300 నుంచి రూ.500 వరకు భారం పడనుంది. ఈ లెక్కన జిల్లాపై సుమారు రూ.300 కోట్లు వరకు భారం పడనుంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ కరెంటు బిల్లులను ప్రజాశక్తి పరిశీలన చేయగా పైవిధంగా విద్యుత్ ఛార్జీల భారం పడుతున్నట్టు వెలుగులోకి వచ్చాయి. నవంబన్ నెల బిల్లులతో డిసెంబర్ బిల్లులను పోల్చినప్పుడు పెరిగినా, తగ్గినా సర్‌ఛార్జి, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జిలు పెరగడం లేదా కొత్తగా పడడం వంటివి కనిపిస్తున్నాయి. ఈ విషయంలో సామాన్యులు, పేదలు, పెద్దలు, వ్యాపారులు అన్న తేడా లేదు. ప్రతి వినియోగదారుడిపైనా అదనపు భారం పడింది. కానీ, డిసెంబర్‌లో వాతావరణం చల్లబడడం, కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గి, చలి కూడా ఉండడంతో ఎసిలు, కూలర్లు, చివరకు ఫ్యాన్ల వినియోగం కూడా తగ్గింది. తగ్గిన వినియోగం వల్ల బిల్లులు తగ్గకపోగా పెరగడంతో ప్రజలంతా లబోదిబో మంటున్నారు.

– విజయనగరంలోని అలకానంద కాలనీకి చెందిన కొట్టాన మహాలక్ష్మి గత నెల (నవంబర్) ఇంటి కరెంటు బిల్లు రూ.272 వచ్చింది. డిసెంబర్ నెల బిల్లు రూ.228 వచ్చింది. అంత మాత్రాన ఈలెక్కన డిసెంబర్‌లో రూ.44 మేర బిల్లు తగ్గిందని భావిస్తే తప్పులో కాళ్లు వేసినట్టే. వాస్తవానికి మహాలక్ష్మి డిసెంబరు నెల బిల్లుకాలంలో ఆ ఇంట్లో ఎవరూ లేరు. కుటుంబ సభ్యులతో కలిసి క్యాంపు వెళ్లారు. అయినా సరే... 10యూనిట్ల విద్యుత్ వినియోగించినట్లు నమోదైంది. నవంబర్ బిల్లు కాల పరిమితిలో 21యూనిట్లు విద్యుత్ ఉపయోగించారు. అయినప్పటికీ తక్కువ బిల్లే వచ్చింది. దీన్నిబట్టి నవంబర్ నెల బిల్లులో యూనిట్ ఒక్కింటికీ రూ.12.95 ఛార్జీ వర్తించగా, డిసెంబర్ నెల బిల్లుకు రూ.22.08 చొప్పున వర్తించింది. వినియోగదారునికి మాత్రం పెద్దగా బిల్లు పెరగనట్టు అనిపించ్చు వచ్చు. కానీ, మునుపెన్నడూ లేని ఎఫ్‌పిపిసిఎ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్) ఛార్జి రూ.13.51, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జి రూ.9 అదనంగా కలిసింది.

ELECTRICITY BILL SWV:2.7
DT:02-11-2024 Time :04:23 PM
ERO VIZIANAGARAM TOWN
SCNO 121103R001082269
SCAT : LT Commercial - Commercia
NET BILL 272.00
DUE DATE 16-11-2024
DISC DATE 02-12-2024

ELECTRICITY BILL SWV:2.8
DT:02-12-2024 Time :03:51 PM
ERO VIZIANAGARAM TOWN
SCNO 121103R001082269
NAME KOTTANAMAHAL..
ADDR LIG 165ALAKANANDA CO..
SCAT : LT Commercial - Commercia
FPPCA CHRG 13.51
FPPCA2 CHRG 9.00
NET BILL 228.00
DUE DATE 16-12-2024
DISC DATE 01-01-2025

గతనెల, ఈనెల బిల్లుల్లో వ్యత్యాసాలు

– నగరంలోని ఎస్‌బిఐ ట్రైనింగ్ సెంటర్ ఎదురుగావున్న జి.సన్యాసి ఇంటి కరెంటు బిల్లులు నవంబర్ నెల రూ.951, డిసెంబర్ రూ.1,115 చొప్పున వచ్చాయి. నవంబర్‌తో పోలిస్తే డిసెంబర్‌లో కేవలం 3యూనిట్లు మాత్రమే అధికంగా వినియోగించారు. బిల్లు మాత్రం రూ.164 పెరిగి పోయింది. పెరిగిన బిల్లు వివరాలు పరిశీలిస్తే గత నెల రూ.25 ఉన్న సర్ ఛార్జీ, డిసెంబర్ బిల్లులో రూ.125గా నమోదైంది. ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీలు గతంలో లేవు. ఈనెల బిల్లులో ఈ రెండూ కలిసి రూ.11.58 చొప్పున పెరిగాయి.

ELECTRICITY BILL SWV:2.8
DT:02-12-2024 Time :03:53 PM
ERO VIZIANAGARAM TOWN
SCNO 121103R001040259
NAME G.SANYASI RA..
ADDR S/o. RAJUALAKANANDA
SCAT : LT Commercial - Commercia
NET BILL 1115.00
DUE DATE 16-12-2024
DISC DATE 01-01-2025

ELECTRICITY BILL SWV:2.7
DT:02-11-2024 Time :04:14 PM
ERO VIZIANAGARAM TOWN
SCNO 121103R001040259
NAME G.SANYASI RA..
SCAT : LT Commercial - Commercia
NET BILL 951.00
DUE DATE 16-11-2024
DISC DATE 02-12-2024

ఈనెల బిల్లుల్లో ట్రూఅప్‌ఛార్జీ

యూనిట్లు తగ్గినా భారం పెరిగింది

విద్యుత్ వినియోగపు యూనిట్లు తగ్గినా బిల్లు భారం పెరిగిపోయింది. నవంబర్‌లో 45యూనిట్ల వినియోగానికిగాను రూ.188.22 బిల్లు వచ్చింది. డిసెంబర్ నెలలో 17యూనిట్లే వినియోగించాం. బిల్లు మాత్రం రూ.254.97 వచ్చింది. ఇదెక్కడి న్యాయం. యూనిట్లు తగ్గితే బిల్లు తగ్గాలి కదా. తాజాగా వచ్చిన బిల్లును బట్టి పరిశీలిస్తే యూనిట్ విలువ ప్రస్తుతం రూ. రూ.10.81గా పెరిగిపోయింది. ఇది ఎంత వరకు సమంజసం. ఓవైపు గ్యాస్, మరోవైపు విద్యుత్ ఛార్జీలు భరించలేనంతగా పెరిగిపోతున్నాయి.

– ఎం.మంగమ్మ, ఆర్‌అండ్‌బి దరి, విజయనగరం

అల్పాహారం తింటున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే మాధవి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు

పేదల ఆకలి తీర్చే 'అన్న క్యాంటీన్'

చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పేదలకు అన్న క్యాంటీన్లు వరమని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నగర పంచాయతీలో బైరెడ్డి సూర్య నారాయణ కల్యాణ మండపం వద్ద నూతనంగా నిర్మించిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే లోకం మాధవి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ కాయ కష్టం చేసుకున్న పేదలకు తక్కువ ఖర్చుతో అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, అన్నా క్యాంటిన్ ద్వారా ప్రభుత్వం అందిస్తుందన్నారు. న్నారు. టిడిపి నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ లాంటి మంచి కార్యక్రమాలు చేపట్టి పేదలకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు అల్పాహారం అందించి మంత్రి, ఎమ్మెల్యే, టిడిపి ఇంఛార్జి నాయకులు కలిసి అన్న క్యాంటీన్'లో అల్పాహారం తిన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ బంగారు సరోజిని, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, మాజీ ఎంపిపిలు కంది చంద్రశేఖర రావు, సువ్వాడ వనజాక్షి , మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు ,క్లస్టర్ ఇంఛార్జి అట్టాడ శ్రీధర్ ,జనసేన నాయకులు చనుమల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరిశీలిస్తున్న అధికారులు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎం ఆదివారం జిల్లాలోని 18 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 3902 విద్యార్థులకు 3763మంది (96.43శాతం) హాజరయ్యారు. కేంద్రాలను డిఇఒ యు.మాణిక్యం నాయుడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించారు.

10న ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటిఐ డిప్లొమా, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18 నుండి 35 సవత్సరాల మధ్య గల నిరుద్యోగులకు ఈనెల 10న ఉదయ 9గంటల నుంచి విటి అగ్రహారంలోని ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. 20-50 హెల్త్ కేర్, స్పందన, స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ , ఇన్నోవా సొర్స్ మొదలగు బహుళ జాతి కంపెనీలు హాజరు అయి అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డుతో పాటుగా బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్, 1 పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 7995691295 లేదా టోల్ ఫ్రీ 9988853335లో సంప్రదించాలని తెలిపారు.

ప్రసాద్‌కు సేవారత్న అవార్డు

ప్రజాశకి-విజయనగరం టౌన్

అవార్డు అందుకుంటున్న ప్రసాద్ పట్నాయక్

మదర్ థెరిస్సా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్, లిఫ్టింగ్ హ్యాండ్స్ ద్వారా శిష్టకరణ పేదలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా రెండు సంస్థలకు అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ సేవారత్న అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ యూసఫ్ గూడలో శిష్టకరణ ఐక్యవేదిక, శిష్టకరణ లేఖ సంయుక్తంగా ఆ సంఘం ఆలిండియా అధ్యక్షులు డివి కృష్ణారావు చేతుల మీదుగా ప్రసాద్‌కు ఈ అవార్డును అందజేశారు.

డ్రెయినేజీ వ్యవస్థతో గ్రామాల్లో శుభ్రత

జొన్నవలస ఎంపిటిసి సభ్యులు రాజేష్‌బాబు

ప్రజాశక్తి-విజయనగరం కోట

పారిశుధ్యంతోనే గ్రామాలు పరిశుభ్రంగా తయారై ఆరోగ్యవంతంగా ఉంటాయని జొన్నవలస ఎంపిటిసి సభ్యులు పూసపాటి రాజేష్ బాబు అన్నారు. గ్రామంలో పల్లెపండగ అభివృద్ధి పనుల్లో భాగంగా సిసి రోడ్లు, కాలువల అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులను రాజేష్‌బాబు దగ్గరుండి పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా కలిసిన ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతిస్తూ సిసి రోడ్లు, కాలువలు నిర్మించడానికి ఉపాధి హామీ నిధులు విడుదల చేసి గ్రామాల పారిశుధ్యనికి మొదట ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. అందులో భాగంగా జొన్నవలస గ్రామంలో మొదటి విడతగా రూ.44 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఆ నిధుతో గత ఐదేళ్లగా అధ్వానంగా తయారైన మురికి కాలువలను నిర్మించడానికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. మొత్తం చిన్న పెద్ద కలిపి 10 కాలువలను 3వేల మీటర్ల పొడుగునా నిర్మిస్తున్నట్లు తెలిపారు. 80 మీటర్ల పొడవునా ఒక సిసి రోడ్డు, దీంతోపాటు ఒక కల్వర్టును కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా పజలకు ఇబ్బంది లేకుండా మురికి నీరు వీధుల్లోకి రాకుండా దారి మళ్లించామని తెలిపారు. నాణ్యతా లోపం లేకుండా పనులు చేపడుతున్నామని చెప్పారు.

కాలువ పనులు పరిశీలిస్తున్న ఎంపిటిసి సభ్యులు పి.రాజేష్‌బాబు

12న పాలస్తీనా సంఘీభావ సభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండ కు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలిస్తీనా ప్రజలకు సంఘీభావంగా (పిఒఎస్ఒ) ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ ఎన్‌వైఎస్ (నవ యువ సమాఖ్య) ఆధ్వర్యాన ఈనెల 12న గుంటూరులో జరిగే సంఘీభావ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు అప్పలరాజు పిలుపునిచ్చారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ పాలస్తీనాలో జరుగుతున్న అమానుషాన్ని, దాని వెనుక దాగివున్న యుద్ధం మనది కాకపోవచ్చునని, కానీ వారికి బాసటగా నిలవడం మన కనీస బాధ్యత అని అన్నారు.అందుకేపాలస్తీనా సంఘీభావ సభలో పాల్గొని, ఇజ్రాయిల్ చేపడుతున్న మారణకాండను ముక్తకంఠంతో వ్యతిరేకిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్ఒ నాయకులు కె గౌతమి , పట్టణ కో కన్వీనర్ సిహెచ్ దిలీప్ కుమార్, కె.శ్రీను, జి.నాగరాజు, కె.భాస్కరరావు, బి.రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతిస్తూ అన్ని ప్రాంతాలలో పరిశుభ్రత కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. రహదారుల పరిశుభ్రతతో పాటు,కాలువలలో పూడికతీత పనులను చేపడుతున్నారు. ప్రత్యేక పారిశుధ్య బృందాన్ని కూడా ఏర్పాటు చేసి అవసరమైన చోట కాలువల ప్రక్షాళన, పొదలు, గుబురుగా పెరిగిన మొక్కలు వంటివి తొలగిస్తున్నారు.

దోమలు నివారణకు ముమ్మరంగా ఫాగింగ్

నగరంలో దోమల నియంత్రణలో భాగంగా పలు ప్రాంతాల్లో ఫాగింగ్ ప్రక్రియను ప్రజారోగ్యశాఖ సిబ్బంది చేపడుతున్నారు. మరోవైపు యాంటీ లార్వా ఆపరేషన్ ప్రక్రియ కూడా చేపడుతున్నారు. అలాగే ప్రజలు కూడా ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి నీరు నిలవ లేకుండా చూడాలని కమిషనర్ నల్లనయ్య స్పష్టం చేశారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఊపందుకున్న గుంతల మరమ్మతు పనులు

నగరంలో రహదారుల పాక్షిక మరమ్మతు పనులు జోరందుకున్నాయి. అన్ని ప్రాంతాలలో పాడైన రహదారులు, గుంతలను పూడ్చడంతోపాటు మరమ్మతులను కూడా చేపడుతున్నారు. అనేక ప్రాంతాలలో బిటి రహదారులపై పాక్షిక మరమత్తు పనులను చేపట్టారు. గుంతలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా తాము కృషి చేస్తున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇప్పటికే నగరంలో ఉన్న గుంతల వివరాలను నమోదు చేసుకుని వాటిని పూడ్చి వెంటనే బిటి రహదారి ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కొంతమంది రహదారులకు ఆనుకొని భవన వ్యర్థాలు వేస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తుప్పలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

అథ్లెటిక్స్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

ఈనెలాఖరులో రాంచీలో జరుగనున్న 68వ అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు టి. పాల్ రాజ్, ఎ.యశోద ఎంపికయ్యారు వీరికి 'ది గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ ఫౌండేషన్' ఆధ్వర్యాన శనివారం విజ్జి స్టేడియంలో రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆ సంస్థ సభ్యులైన ప్రముఖ సీనియర్ బాడ్మింటన్ క్రీడాకారుడు చాగంటి విజయకుమార్ జ్ఞాపకార్థం ఈ విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సూర్యలక్ష్మి, సహాయ కార్యదర్శి హరిగోపాల్ జిల్లా అథ్లెటిక్స్ సంఘ సభ్యులు పాల్గొన్నారు



క్రీడాకారిణికి ఆర్థికసాయం చేస్తున్న సభ్యులు

టెన్నిస్ జాతీయ పోటీల్లో జిల్లా క్రీడాకారుల విజయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హైదరాబాద్‌లో జివికె ఆలిండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీల్లో విజయనగరం ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారులు 45 విభాగంలో విజేతలుగా నిలిచారు. డబుల్స్ లో సౌమిత్రి, దినకర్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. విజయకేతనం ఎగురవేసిన సౌమిత్రి జోడీకి విజయనగరం టెన్నిస్ క్రీడాకారులు సుధ, నరసింహ, మహేష్, వేణు, డాక్టర్ రాజేష్, ప్రశాంత్, మల్లికార్జున్, ముత్తు, చిన్న అభినందనలు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- చెస్ చెల్లింపునకు స్థానిక సంస్థలు సహకరించాలి
- పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.
- 'ప్రజాశక్తి'తో జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి.లక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరంకోట



గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటి అభివృద్ధికి పంచాయతీలు, మున్సిపాలిటీలు చెస్ చెల్లించి తోడ్పాటు అందించాలని జిల్లా కేంద్ర గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి.లక్ష్మి అన్నారు. ఎందరో మహోన్నతులుగా తయారు కావడానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయని చెప్పారు. గ్రంథాలయాల్లో యువతకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చిన్నపిల్లల చందమామ పుస్తకాలనుంచి యువతకు పోటీ పరీక్షలకు గత చరిత్రను తెలిపే పుస్తకాలతో పాటుగా పెద్దలు చదువుకునే ఇతిహాసాలకు సంబంధించిన పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజాశక్తికి ఆమె ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు.

జిల్లా వ్యాప్తంగా ఎన్ని గ్రంథాలయాలు ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 41 గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో గ్రేడ్ల వారీ చూసుకుంటే గ్రేడ్ -1 జిల్లా కేంద్ర గ్రంథాలయం, గ్రేడ్ 2 లో నాలుగు గ్రంథాలయాలు శృంగవరపుకోట, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం, గ్రేడ్ 3లో లైబ్రరీలు 33, గ్రామస్థాయిలో 3 గ్రంథాలయాలు ఉన్నాయి.

గ్రేడ్ 1,2,3 గ్రంథాలయాల్లో ఎటువంటి పుస్తకాలు లభ్యమవుతాయి?

అన్ని గ్రంథాలయాల్లోనూ చిన్న పిల్లల నుంచి పెద్దవారు వరకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలూ అందుబాటులో ఉంటాయి. యువతకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నాం.

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ఏమైనా నిధులు ప్రభుత్వం అందించిందా ?

గత నెల నవంబర్‌లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజులు పాటు నిర్వహించాం. వారోత్సవాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు రాకపోవడంతో గ్రంథాలయ సెస్ నుంచి ఖర్చు చేశాం.

ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాలకు ఎన్నింటికి సొంత భవనాలు ఉన్నాయి? ఇన్ని అద్దె భవనాల్లో నడుస్తున్నాయి ?

ఉమ్మడి జిల్లాలో 25 బ్రాంచ్ లైబ్రరీలు సొంత భవనాల్లో నడుస్తున్నాయి, ఏడు అద్దె భవనాల్లోనూ, 8 రెంట్ ఫ్రీ భవనాల్లోనూ నడుస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా సెస్ ఎంత బకాయి ఉంది, దేని నుంచి ఎంత రావాలి ?

ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 3 కోట్ల 70 లక్షల రూపాయలు సెస్ వసూలు కావలసి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెల్లిమర్ల నగర పంచాయతీ, సాలూరు , పార్వతీపురం పురపాలక సంఘాలు, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సెస్ రావలసి ఉందన్నారు. సాలూరు నుంచి రూ.44 లక్షలు, పార్వతీపురం నుంచి రూ.16 లక్షలు, నెల్లిమర్ల నగరపాలక సంస్థ నుంచి రూ.36 లక్షలు, పంచాయతీల నుంచి సుమారు రూ.2 కోట్లు రావాల్సి ఉంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి గత నెలలో రూ.50లక్షలు చెల్లించారు. ఇంకా కొంత బకాయి చెల్లించాల్సి ఉంది.

ఉద్యోగుల జీతభత్యాలు ఏ విధంగా వస్తున్నాయి?

ఉద్యోగులకు జీతభత్యాలు కింద గతంలో ప్రభుత్వం 50శాతం భరిస్తే సెస్ నుంచి మిగతా 50 శాతం తీసుకోవడం జరిగేది.

పాఠకులకు మీరు ఇచ్చే సందేశం?

విద్యార్థులు, యువత గ్రంథాలయాలను వినియోగించుకోవాలి. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మన పెద్దలు చెప్పారు. అందకనుగుణంగానే బోలెడంత విజ్ఞానం గ్రంథాలయాల్లో ఉంది. వాటిని వినియోగించుకొని యువత ఉన్నత స్థానాలకు ఎదగాలి.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి
గొల్లపల్లి సీతారామస్వామి కోనేరును ఆధునీకరణ చేసి గట్టుపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబినాయనను మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరావు, టిడిపి నాయకులు పిరిడి ఈశ్వరరావు, ప్రజలు కోరారు. ఈ సందర్భంగా కోనేరును గ్రామస్తులతో కలిసి బేబినాయన ఆదివారం పరిశీలించారు. కోనేరు నీరును గతంలో తాగునీరు కోసం వినియోగించే వారమని, కోనేరును ఆధునీకరణ చేసి గట్టుపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, కోనేరు సుందరీకరణకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-బొబ్బిలి
స్థానిక చెరువు పక్కనున్న విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో సోమవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఇఇ ఆవాల అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సిజిఆర్‌ఎఫ్ ఛైర్మన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.మహేలాని, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్ హాజరవుతారని చెప్పారు. మున్సిపల్, గ్రామీణ ప్రాంత విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు.

శ్మశాన వాటికలో వాటర్ ట్యాంకు నిర్మాణం

ప్రజాశక్తి - జామి
విజినిగిరికి చెందిన హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సౌజన్యంతో గ్రామంలోని శ్మశానవాటికలో వాటర్ ట్యాంక్ నిర్మించారు. సుమారుగా రూ.1.50లక్షల నిధులు వెచ్చించారు. దీనిని గ్రామ సర్పంచ్ కిలారి సూర్యారావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు కొవ్వాడ సన్యాసి నాయుడు, కిలారి శ్రీనివాసరావు, మిడతన తాతమనాయుడు, కొవ్వాడ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు కళ్యంపూడి రామనాయుడు, సత్యనారాయణ, తాతరాజు అప్పారావు, హెల్పింగ్ హాండ్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జన సైనికుల కోసమే బీమా

ప్రజాశక్తి - బొబ్బిలి
జనసైనికులు కోసమే జనసేన సభ్యత్వం తీసుకున్న వారందరికీ బీమా చేస్తున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇంఛార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. నియోజకవర్గంలోని రామభద్రపురం మండలంలోని పురుషోత్తం ఐటీసీ రోడ్డు ప్రమాదంలో మరణించగా, గెద్ద రాంప్రసాద్ గాయపడ్డాడు. మృతుని కుటుంబానికి రూ.5లక్షలు, గాయపడిన రాంప్రసాద్‌కు రూ.50వేలు చెక్కును రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయనగరంలో అందజేశారని చెప్పారు. జనసైనికులకు ఏదైనా జరిగితే వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు బీమా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి పని చేస్తామని చెప్పారు.

పచ్చని దుస్తులతో ఆకట్టుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా గ్రీన్ డే వేడుకలు

ప్రజాశక్తి - వేపాడ
మండల కేంద్రంలోని శ్రీ విక్టరీ హైస్కూల్లో గ్రీన్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం ఆకుపచ్చ రంగుతో కూడిన దుస్తులను ధరించి ఆకుపచ్చ రంగు విశిష్టత గురించి వివరించారు. చిన్నారులు ఆకుపచ్చ రంగులో ఉన్న వివిధ రకాల పండ్లు, కూరగాయలు వేషధారణలో అందర్నీ ఆకట్టుకున్నారు. చివరగా ఆకుపచ్చ వర్ణంలో ఉన్న వివిధ రకాలు స్వీట్లు, పిల్లలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్కూల్ కరస్పాండెంట్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ రాఘవ్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో ముగిసిన 'ఎఫ్‌డిపి' శిక్షణ

ప్రజాశక్తి- డెంకాడ
చింతలవలసలోని ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గత ఆరు రోజులుగా జరుగుతున్న ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి) శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమాన్ని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం వారం రోజులు పాటు నిర్వహించింది. గ్రీన్ ఎనర్జీ వ్యవస్థలలో తాజా పురోగతులపై లోతైన పరిజ్ఞానాన్ని, ఆచరణాత్మక దృక్పథాలను అందించేందుకు ఈ శిక్షణ ఇచ్చారు. ఈ ఆరు రోజుల ఎఫ్‌డిపిలో దేశవ్యాప్తంగా 200 మందికి పైగా ఫ్యాకల్టీ, పరిశోధకులు, పీజీ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి కాలికట్ ఎన్ఐటి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టిజె సర్వోత్తమ జ్యోతి పాల్గొని శాస్త్రవేత్తలు, పరిశోధకుల మధ్య సమన్వయంతో కొత్త ఆవిష్కరణలు చేయాలని కోరారు. ఎంవిజిఆర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రమేశ్ మాట్లాడుతూ విద్యా పరిశోధన, పరిశ్రమల మధ్య దూరాన్ని తగ్గించడంలో కళాశాల నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్.రవికుమార్, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శివసుబ్రహ్మణ్యం, సహ సమన్వయకర్త డాక్టర్ రవికుమార్ కొట్టాల తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని జియో నెట్‌వర్క్
వినియోగదారులకు అవస్థలు

ప్రజాశక్తి- మెంటాడ
గత పది రోజులుగా జియో నెట్ వర్క్ పనిచేయకపోవడంతో వినియోగదారుల అవస్థలు పడుతున్నారు. జియో కస్టమర్లు వేలాది రూపాయలు వెచ్చించి స్మార్ట్‌ఫోన్‌లు కొనుగోలు చేసినా సిగ్నల్ సరిగా రాకపోవడంతో మిగతా నెట్ వర్క్‌లను ఆశ్రయిస్తున్నారు. పలుమార్లు జియో కంపెనీకి అంతర్జాలంలో ఫిర్యాదు చేసినా జియో సిబ్బంది నిర్లక్ష్యంగా నచ్చితే ఈ నెట్ వర్క్‌లో ఉండండి లేదా వేరే నెట్ వర్క్‌లోకి వెళ్లాలని చెప్పడం విశేషం. ఇప్పటికైనా జియో నెట్ వర్క్ సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

వేతనాలు ఇవ్వకపోతే ఎలా?

ప్రజాశక్తి - వంగర
ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు ఆదివారం ప్రజాశక్తి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మొత్తం 46 మంది ఆయాలు పనిచేస్తున్నారు. వీరంతా ఆయా పాఠశాలల్లో సమయానికి వచ్చి మరుగుదొడ్లు శుభ్రం చేయడం తోపాటు, తరగతి గదులు శుభ్రం చేయడం పాఠశాల మొత్తం శుభ్రపరిచి ఎంతో ఆహ్లాదకర వాతావరణాన్ని పిల్లలకు అందిస్తున్నారు. ఇంత కష్టపడి పనిచేస్తున్న వీరికి గత ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు అందేవిధంగా చర్యలు చేపట్టాలని మండలంలో వివిధ గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు కోరుతున్నారు. ఈ విషయంపై మండల విద్యాశాఖాధికారి వై.దుర్గారావుని వివరణ కోరగా పాఠశాలల ఆయాలకు సంబంధించి బడ్జెట్ విడుదలైందని త్వరలోనే వారి అకౌంట్లో జమ అవుతాయని తెలిపారు.

చీటీల నిర్వాహకుడిపై ఫిర్యాదుకు సిద్ధం

- ముందుకు వస్తున్న బాధితులు
- 10 రోజుల క్రితం కుటుంబంతో సహా పరారైన నిర్వాహకుడు
- తిరిగి బాధితులు, పోలీసులపై రిట్ పిటిషన్
- పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు
- పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలని సూచించిన పోలీసులు

ప్రజాశక్తి - భోగాపురం
ప్రజల నుంచి అప్పులు తీసుకొని, చీటీలు నిర్వహించి తిరిగి చెల్లించకుండా మోసగించిన చీటీల నిర్వాహకుడిపై ఎట్టకేలకు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు. గ్రామ పెద్దలు న్యాయం చేస్తారనే నమ్మకంతో ఇప్పటి వరకు ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. దీనిని అలుసుగా తీసుకున్న చీటీల నిర్వాహకుడు గ్రామం నుంచి అర్ధాంతరంగా కుటుంబంతో సహా పదిరోజుల క్రితం పరారయ్యాడు. అంతేకాక తనను గ్రామస్తులు, పోలీసులు వేధిస్తున్నారంటూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడం విశేషం. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు చీటీల నిర్వాహకుడిపై ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

భోగాపురం గ్రామంలోని తోటవీధికి చెందిన తిరుమరెడ్డి మురళీ భోగాపురంలో గత 15ఏళ్ల నుంచి చీటీలు నిర్వహిస్తున్నాడు. అందరి వద్ద నమ్మకంగా ఉండడంతో చాలా మంది అప్పులు కూడా ఇచ్చారు. ఇలా సుమారు రూ.30కోట్ల వరకూ అందరి వద్ద చీటీలు అప్పుల రూపంలో తీసుకున్నాడని బాధితులు చెబుతున్నారు. వీరందరికి ఈ సొమ్ము చెల్లించేందుకు తనవద్ద లేవంటూ సుమారు 40రోజుల క్రితం ఆత్మహత్య ప్రయత్నం చేశాడని బాధితులు చెబుతున్నారు. గడ్డిమందు తాగేశానని, నిద్రమాత్రలు మింగేశానని చెప్పడంతో వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఇప్పటివరకు గడ్డిమందు తాగి ప్రాణాలతో బయటపడిన వారు లేరు. కానీ ఈయన మాత్రం వెంటనే కోలుకున్నాడు. అప్పట్లోనే ఆసుపత్రి నుంచి పరారయ్యే అవకాశం ఉందని బాధితులకు సమాచారం రావడంతో స్థానిక పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. బాధితులే దగ్గరుండి ఆసుపత్రిలో కాపలకాశారు. చివరికి కోలుకొని ఇంటికి వచ్చిన తరువాత పెద్దమనుషుల సమక్షంలో బాధితులంతా నిలదీశారు. కష్టపడిన సొమ్ము నీదగ్గర దాచుకున్నామని, మమ్మల్ని మోసం చేయవద్దు అంటూ కొంతమంది కాళ్ళ వేళ్ల పడ్డారు. అనంతరం గ్రామంలో ఉంటానని బాధితులను నమ్మించాడు. ఈ నేపథ్యంలో గత నెల 20వ తేదీన ఇంటి నుంచి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లితో సహా పరారైపోయాడు. ఈ విషయం కుటుంబ సభ్యులైన మేనల్లుడికి, సోదరికి తెలుసునని వారిని కొంతమంది ప్రశ్నించారు. ఎక్కడకి వెళ్లిపోయాడో తమకు తెలీదని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేయాలని బాధితులు చెప్పడంతో వివరాల ఫిర్యాదు చేశారు.

చీటీల నిర్వాహకుడు

బాధితులతో పాటు పోలీసులపై హైకోర్టులో రిట్ పిటిషన్
గ్రామంలో కొంత మంది వద్ద అప్పు తీసుకున్నానని దీంతో తనను కొంత మంది బాధితులు వేధిస్తున్నారని, పోలీసులు నుంచి కూడా తనకు రక్షణ కావాలని హైకోర్టులో చీటీల నిర్వాహకుడు రిట్ పిటీషన్ దాఖలు చేశాడు. ఈ విషయం గ్రామంలోని బాధితులకు తెలిసింది. తమను మోసం చేసి తిరిగి తమపైనే కేసులు వేస్తున్నాడంటూ మండిపడ్డారు. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలని పోలీసులు చెప్పడంతో రెండు మూడు రోజుల్లో ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు.

ఎమ్మెల్సీకి ఇచ్చిన హామీలు హుళక్కేనా?

- వివాదాలను పట్టించుకోని టిడిపి అధినాయకత్వం
- ఇరు గ్రూపుల్లో పెరుగుతున్న గందరగోళం

ప్రజాశక్తి - జామి
'ఏరుదాటాక ముందు ఏరుమల్లన్న, ఏరు దాటాక బోడిమల్లన్న' అన్న చందంగా ఉంది టిడిపి నాయకుల వ్యవహారం. ఈ మాట చెబుతున్నది ఎవరో కాదు.. ప్రస్తుత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు వర్గీయులు. సాధారణ ఎన్నికల్లో రఘురాజు టిడిపికి మద్దతుగా నిలిచారు. అయితే అధికారం చేపట్టాక ఎమ్మెల్సీ గ్రూపు వారిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని రఘురాజు గ్రూపు వారు ఆవేదన చెందుతున్నారు. రఘురాజు న్యాయ పోరాటం తర్వాత ఎమ్మెల్సీ పదవి రావడం పట్ల తెలుగు తమ్ముళ్లకు కంటగింపుగా మారిందన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఇరు గ్రూపుల మధ్య కోల్డువార్ నడుస్తోంది. ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజుకు, వైసిపికి మధ్య ఏర్పడిన కలహాలను ఎన్నికల్లో టిడిపి బాగా వినియోగించుకున్న విషయం తెలిసిందే. అధికారం వచ్చాక రఘురాజు గ్రూపు వారిని ఎమ్మెల్యే లలిత కుమారి పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని వారంతా ఆవేదన చెందుతున్నారు. తమ నాయకుడిని పూర్తిగా ఎన్నికల్లో వాడుకొని అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరునెలల్లోనే ఇరు గ్రూపుల మధ్య వివాదం నెలకొన్నా..అదిష్టానం మాత్రం పూర్తిగా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వాస్తవానికి ఎమ్మెల్సీ రఘురాజుకు, గత ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకి మాత్రమే వివాదం ఉండేది. దాన్ని ఎన్నికలకు వాడుకున్న టిడిపి అధి నాయకులు ఎన్నికల ముందు రఘురాజుకు అనేక హామీలు గుప్పించారు. ముఖ్యంగా ఎస్.కోట, వేపాడ మండలాల్లో పూర్తిగా రఘురాజుకు అప్పగిస్తామని చెప్పారట. నియోజకవర్గ పునర్విభజన పూర్తయితే, ఎస్.కోట నియోజకవర్గాన్ని పూర్తిగా రఘురాజుకు అప్పగిస్తామని అన్నారట. ఎమ్మెల్సీ భార్యకు టిటిడి బోర్డు డైరెక్టర్, 40శాతం నామినేటెడ్ పోస్టులు ఇలా హామీలపై హామీలు గుప్పించి, తీరా పదవి వచ్చాక పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రఘురాజు గ్రూపులో ప్రజాప్రతినిధులుగా ఉన్నవారే కార్యక్రమాల్లో పాల్గొంటే, టిడిపి నాయకులు విమర్శించడం బాధాకరమని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టిడిపి అధిష్టానం వివాదాలపై దృష్టి సారించకుంటే, నియోజకవర్గంలో గందరగోళం తప్పదని పలువురు అంటున్నారు.

నిరసన తెలుపుతున్న మహిళలు

కొనసాగుతున్న ఆందోళన

ప్రజాశక్తి-బొబ్బిలి
మేదరబంద జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపుకు వ్యతిరేకంగా మహిళలు ఆందోళన కొనసాగిస్తున్నారు. జన నివాసాల మధ్య మద్యం షాపు పెట్టవద్దని డిమాండ్ చేస్తూ నెల రోజులుగా స్థానికులు ఆందోళన చేస్తున్నారు. నిత్యం జనంతో రద్దీగా ఉన్న మేదరబంద జంక్షన్‌లో మద్యం షాపు వేరే ప్రాంతానికి తరలించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఆందోళన చేస్తున్న మహిళలకు, మందుబాబులు మధ్య ఆదివారం సాయంత్రం స్వల్పంగా గొడవ జరిగింది. మద్యం షాపు తరలించే వరకు ఆందోళన కొనసాగిస్తామని మహిళలు తెగేసి చెప్పారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గరివిడి
పట్టణంలోని కెఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే కళా వెంకటరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్మల్లిక్‌నాయుడు ఆధ్వర్యంలో జరగనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రచార కమిటీ ఉమ్మడి విజయనగరం జిల్లా కోఆర్డినేటర్ కొట్ల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 9న ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు.

వేరుశనగ విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి - వేపాడ
మండల కేంద్రంలో గల రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ అధికారి యశ్వంత్ కుమార్ తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు 30 కేజీలు బస్తాకి రూ.1800 చెల్లించి తీసుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు

ప్రజాశక్తి - నెల్లిమర్ల
జిల్లాలో ఇటీవల మృతి చెందిన గొర్రెలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో పెదబూరాడపేటలో గొర్రెల పెంపకందార్లను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ జిల్లాలో వరి పొలాలలో వరి కంకులు (వరి వెన్నులు) తిని మృతి చెందిన గొర్రెలకు నష్టపరిహారం ఇచ్చి గొర్రెల పెంపకందార్లను మంత్రి కింజరాపు అచ్చంనాయుడు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కత్తెర పురుగు, కొమ్ము పురుగు వరి పంటను ఆశించి చేతికి వచ్చిన వరి కంకులను కత్తిరించి రైతులకు నష్టం కలిగించిన విషయం మంత్రి దృష్టికి గతంలో తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏదైతే కత్తెర పురుగు, కొమ్ము పురుగు కారణంగా వరి పంట దెబ్బతిని రాలిపోయిన ఆ వరి పొలాల్లో ధాన్యాన్ని, వరి కంకులను తిన్న గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకమైన ఘటనలు గంట్యాడ మండలంలోని బుడతనాపల్లిలో జరిగి 8 గొర్రెలు, బొండపల్లి మండలం రైంద్రాంలో 40 గొర్రెలు చనిపోయాయన్నారు. పొలాల్లో వరి కంకులు, ధాన్యం తిన్న గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని వీటికి కారణాలు పరిశీలించి నివారణ చర్యలు తీసుకోని ఇప్పటికే మృతి చెందిన గొర్రెలకు వాటి పెంపకం దార్లకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల పెంపకందార్లు డొప్ప త్రినాధ్, కర్రి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి - తెర్లాం
పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కె.విసు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్రను చదివించారు. ఆర్యభట్ట కథలు, చంద మామ కథలు, అక్బరుద్దీన్ కథలను కూడా చదివించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల యాధికారి సిహెచ్ కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం అంటే మాకిష్టం కార్యక్రమంలో భాగంగా కథల పుస్తకాలను గ్రంథాలయాధికారి మహేష్ చదివించారు. బాలమిత్ర కథలు, చందమామ కథలు, బాల భారతం, బాల రామాయణం, పంచతంత్ర కథలు, తెనాలి రామకృష్ణ కథలు, జాతీయ నాయకుల గురించిన పుస్తకాలు, పరమానందయ్య శిష్యుల కథలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ విద్యార్థులు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మేనక, అనురాధ, భవాని, లోహిత్, ఉష, సాయి, దుర్గా ప్రసాద్, సాయి, ఇందు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి మహేష్

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు

ప్రజాశక్తి- బొబ్బిలి
సిబిఎం బాలికోన్నత పాఠశాల గుర్తింపు రెన్యూవల్ చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కన్వీనర్ ఎస్.గోపాలం అన్నారు. సిపిఎం కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సిబిఎం పాఠశాల గుర్తింపు రెన్యూవల్ చేయకపోవడంతో విద్యార్థులు భవిష్యత్ ఏమిటని ప్రశ్నించారు. ఏప్రిల్ నెలలో పదో తరగతి పరీక్షలు జరుగుతాయని, గుర్తింపు రెన్యూవల్ అవ్వకపోతే పరీక్షలు రాసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిబిఎం పాఠశాల కరస్పాండెంట్‌ను తొలగించిన జిల్లా కలెక్టర్ పాఠశాల గుర్తింపు రెన్యూవల్ చేసి విద్యార్థులు భవిష్యత్తుకు అండగా ఉండాలని కోరారు. లేనిచో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలను కలుపుకుని పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సిబిఎం పాఠశాల గుర్తింపు రెన్యువల్ చేయాలి
సిబిఎం పాఠశాల గుర్తింపు రెన్యూవల్ వెంటనే చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మంనాయుడు జిల్లా కలెక్టర్‌ను ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. స్కూల్ గుర్తింపు రెన్యువల్ చేయకపోవడం వల్ల విద్యార్థులు భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారయ్యే పరిస్థితి వస్తుందన్నారు.

అప్పలనాయుడికి ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి- బాడంగి
కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పల నాయుడుకు ఆదివారం ఆత్మీయ సత్కారం జరిగింది. విజయ నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో జనసేన జిల్లా అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన గెలుపులో అప్పలనాయుడు పాత్ర ఎంతో ఉందని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తున్న వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అప్పల నాయుడు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ కష్టపడి పని చేసే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందనేందుకు తానే ఉదాహరణ అని తెలిపారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేస్తానని చెప్పారు. మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు బేబీ నాయన, లోకం మాధవిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం మాధవి, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి రాజు, పాల్గొన్నారు.

అప్పలనాయుడును సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

అలరించిన మయూరి నృత్యాలయ విద్యార్థినులు

ప్రజాశక్తి- విజయనగరం కోట
పట్టణానికి చెందిన శ్రీ మయూరి నృత్యాలయ విద్యార్థినులు సంప్రదాయ నృత్యంలో అలరించారు. తమ నృత్య ప్రదర్శనలతో అందరినీ అలరిస్తూ ఇప్పటికే స్థానికంగా పలు ప్రదర్శనలు చేసిన విద్యార్థినులు తాజాగా వారణాసి, అయోధ్యలో కూడా తమ నృత్య ప్రదర్శనలతో అక్కడివారిని ఆకట్టుకున్నారు. ఈనేపథ్యంలో శ్రీ మయూరి నృత్యాల డైరెక్టర్ శ్రీదేవి కృష్ణకు వారణాసి, అయోధ్య రామ అవార్డులు లభించాయి. తిరుపతికి చెందిన శ్రీసాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ, విశాఖకు చెందిన ఆర్టిస్ట్ ఫ్యాక్టరీ సంయుక్తంగా అయోధ్యలో నిర్వహించిన శ్రీరామ సంగీత నృత్యాంజలిలో శ్రీ మయూరి నృత్యాలయానికి చెందిన డైరెక్టర్ ఎమ్ శ్రీదేవి కృష్ణ, ఏడుగురు విద్యార్థునులతో కలిసి అయోధ్యలో భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు చేసి ప్రశంసలు పొందారు. ఇంటర్నేషనల్ ఆర్గనైజర్ గ్రేడ్ ఆర్టిస్ట్ డాక్టర్ శరత్ చంద్ర చేతుల మీదుగా అయోధ్యరామ అవార్డును విద్యార్థినులు అందుకున్నారు. ఈ సందర్భంగా మయూరి నృత్యాలయ డైరెక్టర్ ఎం శ్రీదేవికృష్ణ మాట్లాడుతూ వారణాసి అయోధ్యలో ప్రదర్శనలు ఇచ్చే అవకాశం తమ నృత్యాలయానికి దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. సంప్రదాయం నృత్యంలో రాణిస్తున్న విద్యార్థినులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో తాము ప్రదర్శనలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా నృత్య బృందాన్ని పలువురు అభినందించారు.

అవార్డులతో శ్రీదేవికృష్ణ, విద్యార్థినులు

జాకేరు రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి - వేపాడ
మండలంలోని వేపాడ, సోంపురం గ్రామం నుంచి జాకేరు, కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట గ్రామం వరకు రోడ్డు గోతులు పడడంతో బడి బస్సు వేయడానికి ఆర్‌టిసి యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు తీసుకుని వెళ్ళగా రోడ్డు మరమ్మతు పనులు చేసేందుకు రూ. 4.05లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో ప్రస్తుతం ప్యాచ్ వర్క్ పనులు చేస్తున్నారు. ఇకపోతే రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్ తొలగింపునకు కూడా నాలుగు లక్షల మంజూరైనట్లు ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు. ఈ రెండు పనులు పూర్తి చేస్తే ఎస్‌కోట ఆర్‌టిసి డిపో యాజమాన్యం బడి బస్సు నడపడానికి సిద్ధంగా ఉన్నట్లు డిపో మేనేజర్ రమేష్ తెలిపారు.

మరమ్మతులు చేస్తున్న కూలీలు

భగవద్గీత పఠన పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరంకోట
విజయనగరం చిన్మయ మిషన్ నిర్వహించిన భగవద్గీత పఠన రాష్ట్రస్థాయి పోటీలకు బి-కేటగిరి విభాగంలో చింతవలస శ్రీవాణి సంతోష్ స్కూల్‌కు చెందిన 2వ తరగతి విద్యార్థి లోచర్ల హసిత కోమల్, 5 వ తరగతి విద్యార్థి జి. శ్రీ ఆద్య ఎంపిక అయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 15న కడపలో జరుగుతాయని ప్రిన్సిపాల్ కె. సంతోష్, కరెస్పాండెంట్ ఎల్. కృష్ణ కుమారి తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.


జి. శ్రీఆద్య

ప్రశంసా పత్రాలతో లోచర్ల హసిత కోమల్

ప్రతిపాదనలు సరే.. నిధులేవి?

ప్రజాశక్తి - వేపాడ
మండలంలో గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యాలు లేక అత్యవసర సమయాల్లోనూ, ఆరోగ్యానికి గురైన వారిని సకాలంలో ఆస్పత్రులకు తరలించడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఇటీవల తీసుకెళ్లారు. దీంతో జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్డు నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పిఆర్‌జెఇకు ఆదేశించారు. దీంతో అధికారులు సింగరాయ నుంచి ఆతవ రోడ్డుకు, ఆతవ నుంచి బానాది గ్రామానికి, సింగరాయ నుంచి చందులూరు, ఆకులసీతంపేట నుంచి కొండగుళ్ళు దేవాలయానికి గ్రావెల్ మెటల్ రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రతిపాదనలు పంపించినా ఇంత వరకూ నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఫలితంగా ప్రజలకు పాత కష్టాలే పునరావృతం అవుతున్నాయి. సిఎంఒ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులపై కూడా స్పందించకపోతే ఎలా అని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతిపాదనలకు అనుగుణంగా నిధులు మంజూరు చేసి రోడ్లు వేయాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రామభద్రపురం: మండల కేంద్రంలోని మారుతీ కాలనీకి చెందిన షేక్ బాబ్జీ (43) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు బాబ్జీ అతిగా మద్యం తాగుతున్నాడని కుటుంబ సభ్యులు మందలించడంతో ఆదివారం ప్లాస్టిక్ పైపునకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడు అవివాహితుడు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోడిపందేలపై దాడులు

వేపాడ: మండలంలోని కొత్త సింగరాయి గ్రామ పరిసరాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వల్లంపూడి ఎస్ఐ బి.దేవి తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి ఒక కోడి పుంజును, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో హెడ్‌కానిస్టేబుల్ సూరిబాబు, కానిస్టేబుల్ సింహాచలం నాయుడు, సత్యం, కనకరాజు పాల్గొన్నారు.